క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన పి.నటరాజన్, పి.మునిలక్ష్మమ్మ కుటుంబ సభ్యులతో కలసి బుధవారం రూ.50,501 విరాళంగా అందజేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు విరాళాన్ని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పిచ్చాటూరు: మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు హుస్సేన్ సాహెబ్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముడియూరు, పిచ్చాటూరు, కీళపూడి, నీరువాయి, రజానగరం, అప్పంబట్టు, వేలూరు గ్రామాల్లోని మొత్తం 15 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. కేంద్రాలలో వసతులపై ప్రధానంగా దృష్టి సారించామని తెలిపారు. ఆర్ఐ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో పాడిఆవు మృతి

సత్యవేడు: మండలంలోని అంబాకం గ్రామంలో బుధవారం విద్యుత్ షాక్‌కుగురై పాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన శంకరమ్మ జెర్సీ ఆవును పచ్చిగడ్డి మేత కోసం పొలాల వద్దకు తోలు కెళ్లింది. ఆవు పొలంలో గడ్డి మేస్తున్న సమయంలో విద్యుత్‌స్తంభాన్ని తగలగానే షాక్‌కు గురై విద్యుత్ స్తంభం సమీపంలోనే మృతి చెందింది. ఎర్త్ వైర్‌నుంచి విద్యుత్ సరఫరా అయ్యి షాక్‌కు గురైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆవు విలువ రూ.60వేలు చేస్తున్నందని బాధితురాలు తెలిపింది. సర్పంచ్ సంగీత ఇన్సురెన్సు క్లెయిమ్ చేయించి రైతుకు న్యాయం చేస్తామన్నారు. ఆవు మృతి సమాచారాన్ని పశువైద్యులకు సమాచారం అందించారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ



ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద బుధవారం డివైడర్‌ను లారీ ఢీకొని ఆగిపోయింది. శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి అతివేగంగా వెళుతున్న లారీ డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. రోడ్డుపైన లారీ ఆగిపోవడంతో ట్రాఫిక్ స్తంభించి ఇరువైపుల వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

పంచాయతీ అభివృద్ధికి మరింత కృషి

ఏర్పేడు: పంచాయతీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. బుధవారం మండలంలోని ఎండీపుత్తూరు సచివాలయంలో సర్పంచ్ పదవి చేపట్టి మూడేళ్లు అయిన సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, శ్మశాన వాటికల అభివృద్ధి పనులు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధ శ్రీసర్వ మంగళ సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నందీశ్వరునికి ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. నందీశ్వర స్వామివారికి, శ్రీవాల్మికేశ్వర స్వామివారికి ఏక కాలంలో ప్రదోష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయ చైర్మెన్ ఏపీఎం మునిచంద్ర శేఖర్ రెడ్డి, కార్యనిర్వాహణాఅధికారి కె.రామచంద్ర రెడ్డి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యా సామగ్రి పంపిణీ

శ్రీకాళహస్తి: మండలంలోని భైరవ ఎస్టీకాలనీలోని విద్యార్థులకు రాయలసీమ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సుబ్బరామిరెడ్డి సహాయంతో రైటింగ్ ప్లాడ్లు, పుస్తకాలను యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షుడు మునిశేఖర్ అందజేశారు. మండల కోఆర్డినేటర్ నాగమణి, వలంటీర్ వెంకటేష్ పాల్గొన్నారు.

కత్తులతో పరస్పర దాడి

- ఇద్దరికి గాయాలు

కేవీబీపురం: పొలానికి నీరు అందించే విషయంలో తలెత్తిన వివాదం ముదిరి కత్తులతో ఘర్షణకు దిగిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని పెరిందేశంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. పెరిందేశం దళితవాడకు చెందిన వెట్టి మాధవయ్య(60) తన పొలానికి నీరు రాకుండా అడ్డుకుంటున్నాడని అదే గ్రామానికి చెందిన బత్తెయ్య (56) పొలం వద్ద వాగ్వివాదానికి దిగాడు. ఇద్దరి మధ్య గొడవ పెరగడంతో స్థానిక రైతులు సర్దిచెప్పారు. ఇంటికి చేరుకున్న అనంతరం బత్తెయ్య మళ్లీ కత్తితో వచ్చి మాధవయ్యను కడుపులో పొడిచాడు. ఇది గమనించిన మాధవయ్య కొడుకు బత్తెయ్యపై కత్తితో దాడి చేశారు. ఇద్దరినీ బంధువులు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏఎస్ఐ లోకనాథం తెలిపారు.

వలంటీర్లే నిజమైన సంక్షేమ సేవకులు





పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎంపీ మద్దిల గురుమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్, హాజరైన వలంటీర్లు

- అర్హతే ప్రామాణికంగా పథకాలు
- వలంటీర్లకు వందనంలో ఎంపీ మద్దెల గురుమూర్తి
- సేవారత్న, సేవా మిత్ర పురస్కారాల ప్రదానం

వరదయ్యపాళెం: ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఒక్క రూపాయి అవినీతి, వివక్ష లేకుండా అందిస్తున్న వలంటీర్లే నిజమైన సంక్షేమ సేవకులని తిరుపతి పార్లమెంటు సభ్యుడు మద్దిల గురుమూర్తి అన్నారు. బుధవారం వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరై వలంటీర్ల సేవలను ప్రశంసించారు. మండలంలోని 249 మంది వలంటీర్లకు సేవామిత్ర, ఐదుగురికి సేవారత్న పురస్కారాలను అందజేసి సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. ముందుచూపు ఆలోచనతో ముఖ్యమంత్రి జగనన్న గ్రామ వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు మన రాష్ట్రంలోని సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఆదర్శంగా తీసుకుంటున్నాయని, వారి రాష్ట్రాల్లో కూడా ఈ వ్యవస్థలను అమలు చేసే దిశగా ఆలోచన చేస్తున్నాయని తెలిపారు. ఇంతటి మంచి గుర్తింపు తీసుకువచ్చిన సీఎం జగనన్నకు అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా రుణం తీర్చుకోవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క పథకం కావాలన్న ఆ పార్టీకి చెందిన జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదని, చివరికి ఆ పార్టీకి చెందిన వారికే పథకాలు దక్కేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు గ్రామ వలంటీర్ల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు.

సత్యవేడులో 86వేల కుటుంబాలకు లబ్ధి

సత్యవేడు నియోజకవర్గంలో జగనన్న పాలనలో 28 పథకాలు ద్వారా 86వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా రూ.1400కోట్లు, పరోక్షంగా అభివృద్ధి కార్యక్రమాలకు రూ.600కోట్లు ఖర్చు చేసినట్లు ఎంపీ గురుమూర్తి వివరించారు. ఇవన్నీ కూడా గ్రామ వలంటీర్ల ద్వారా అవినీతి రహితంగా లబ్ధిదారులకు అందాయన్నారు. జరిగిన మంచిని గ్రామ వలంటీర్ల ఇంటింటికీ వెళ్లి వివరించాలని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సైనికులుగా పనిచేయాలని కోరారు. అనంతరం సమన్వయకర్త నూకతోటి రాజేష్ మాట్లాడుతూ జగనన్న పారదర్శక పాలనను వలంటీర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సీఎం జగనన్న తీసుకొచ్చిన సంక్షేమ సంస్కరణలు దేశానికే ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, సర్పంచులు జ్యోతి, దుడ్డు వేణు, రమణయ్య, శ్రీధర్ రెడ్డి, దీప, లోకేశ్వరి, అలీ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా

ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తూ గ్రామంలోని పేదలకు సేవలందించడం సంతృప్తిగా ఉంది. వలంటీర్‌గా అవకాశం కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాను. తిరుపతి ఎంపీ చేతుల మీదగా సత్కారం అందుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా.

–హెప్సీ, గ్రామ వలంటీర్, వెంగారెడ్డికండ్రిగ

జగనన్నకు రుణపడి ఉంటాం

ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా స్వేచ్ఛగా పనిచేస్తూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. నిరుద్యోగిగా ఉన్న నాకు వలంటీర్‌గా ఉపాధి కల్పించిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటా. గ్రామంలోనే సేవ చేసే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉంది.

– నరేష్, గ్రామ వలంటీర్, వరదయ్యపాళెం

జగనన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా



మిద్దెల హరిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా నియమించడం ఆనందంగా ఉందని, నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి తెలిపారు. బుధవారం విజయవాడలో సంస్థ కార్యాలయంలో ఆయన వైస్ చైర్మన్‌గా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయనను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి తన వంతు కృషి చేస్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యమని తెలిపారు. గన్నేరి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం ర్యాంపుల ఏర్పాటు



ఇరుగుళం కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సత్యవేడు: ఎన్నికల కేంద్రాలకు వచ్చి దివ్యాంగులు సులభంగా ఓటు వేసేలా ర్యాంపులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ రామాంజనేయులు సూచించారు. బుధవారం మండలంలోని కాళమనాయుడుపేట, కొత్తమారికుప్పం, వానెల్లూరు, పెద్ద ఈటిపాకం, కొల్లడం, ఇరుగళం, రాజగోపాలపురం కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. కేంద్రాల వద్ద సౌకర్యాలను గుర్తించారు. బీఎల్‌ఓలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. విద్యుత్‌వసతి, లైట్లు, ఫ్యాన్లు పనిచేస్తున్నాయా లేదా? ఫర్నిచర్ వివరాలపై ఆరా తీశారు. మరుగుదొడ్లు, నీటి వసతిని పరిశీలించారు. మండల పరిధిలో 50 పోలింగ్ కేంద్రాలలో వసతులు పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ శ్యామ్యూల్, కోటీశ్వరం, టి.జయ, రాజశేఖర్, సుధాకర్, రమేష్, మహేష్ అలిమేలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యం



కమ్మకొత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి : అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరిగినట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కమ్మకొత్తూరులో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు లబ్ధి అందిందని తెలిపారు. అర్హతే ప్రమాణికంగా పథకాలను ఇంటి ముంగిటకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి బియ్యపు మధుసూదన్ రెడ్డి శ్రీకాళహస్తిలోనే అందుబాటులో ఉంటూ సమస్యలన పరిష్కరిస్తున్నారని తెలిపారు. ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేసేవారే నిజమైన నాయకుడని చెప్పారు. కరోనా కష్టకాలంలో కూడా ప్రతిపక్ష నేతలు పక్క రాష్ట్రంలో తలదాచుకుంటే ప్రజలకు అండగా నిలిచి ఆదుకున్న వ్యక్తి ఎమ్మెల్యే మాత్రమేనని గుర్తు చేశారు. సంక్షేమ పాలన కావాలంటే వైఎస్సార్ సీపీని రానున్న ఎన్నికల్లో ఆదరించాలని ఆమె కోరారు. సర్పంచ్ రజని, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ వయ్యాల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రాములమ్మ, నాయకులు పుల్లయ్య, ప్రకాష్, నరేంద్ర, సుధాకర్, మునిరత్నం, సుబ్రమణ్యం, అశోక్‌కుమార్, రాజీవ్‌గాంధీ, దేవి, కృష్ణయ్య, సురేష్, మనోహర్, ఆనంద్, రామారావు, సుబ్బారావు, ప్రభాకర్, రామ్మూర్తి, ఈశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, సురేంద్రయాదవ్, మిల్క్ సొసైటీ చైర్మన్ మధుసూదన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



నగదును అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లెలో శ్మశాన వాటిక రోడ్డు నిర్మాణం, వసతుల కల్పనకు బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. ఏళ్ల తరబడి శ్మశానానికి మృతదేహాలను తరలించాలంటే రోడ్డు సౌకర్యంలేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీకి గ్రామస్తులు సూచించారు. ఎమ్మెల్సీ స్పందించి గ్రామానికి వెళ్లి పంచాయతీకి రూ.2 లక్షలు నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. వైస్ ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, నాయకులు అంకిరెడ్డి, రామ్‌రెడ్డి, చెంచురెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, డి.మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ పర్యటన

కేవీబీపురం: మండలంలో గురువారం తిరుపతి ఎంపీ గురుమూర్తి పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చే యనున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్ కూడా పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

పుస్తెల భారం వద్దు.. చదువే ముద్దు



మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

సత్యవేడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ దేవకుమారి అన్నారు. ఇరుగుళం ఉన్నత పాఠశాలలో బుధవారం బాలికలకు బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండకుండానే బాలికలకు వివాహం చేయడం వల్ల అనారోగ్యంతో పాటు ఎన్నో సమస్యలు వస్తాయని తెలిపారు, విద్యార్థులకు బాల్యంలో పుస్తెల భారం వద్దు.. చదువే ముద్దు అంటూ నినాదాలు చేయించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న హెచ్‌ఎం గిరి ప్రకాష్

పిచ్చాటూరు: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని పిచ్చాటూరు హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయుడు గిరి ప్రకాష్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ సెకెండియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నగదు రహితంగా ఇంటి పన్ను వసూలు



సూచనలిస్తున్న పంచాయతీ అధికార ప్రభురెడ్డి

నాగలాపురం: నగదు రహితంగా ఇంటి పన్ను వసూలు చేయాలని డివిజినల్ పంచాయతి అధికారి ప్రభు రెడ్డి తెలిపారు. పంచాయతీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. మూడు సచివాలయాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇంటి పన్ను వసూళ్లు, 2024–2 అభివృద్ధి ప్రణాళిక, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, పీఎం విశ్వకర్మ అమలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఇంటి పన్నులను డిజిటల్ విధానంలో వసూలు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ ,ఈఓపీఆర్డీ శైలేంద్ర, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గంగ నీటిని అందించాలని ఎంపీకి వినతి



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం, కుక్కంబాకం, నీర్పాకోట గ్రామాల్లోని పంట పొలాలకు గంగనీటిని అందించాలని బుధవారం బుచ్చినాయు డుకండ్రిగలో తిరుపతి ఎంపీ మద్దిలగురుమూర్తికి రైతులు విన్నవించారు. రైతులు మాట్లాడుతూ కుక్కంబాకం, కాంపాళెం, నీర్పాకోట గ్రామాల్లో సాగునీరు అందక 2వేల ఎకరాల్లోని పంటలు ఎండి పోతున్నాయని తెలిపారు. పంటలు చివరిదశకు చేరుకున్నాయని, నీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. గంగనీటిని చెరువుకు వదిలితే పంటలు పండుతాయని, లేకుంటే అప్పులుచేసి పెట్టిన పంటలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీ మద్దిలగురుమూర్తి మాట్లాడుతూ గంగ సీఈతో మాట్లాడి, నీరు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. రైతుల మరో ప్రశ్నకు ఎంపీ గురుమూర్తి ట్రాన్స్‌కో ఎఈ పుణ్యకోటిని పిలిపించి వ్యవసాయానికి 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వకర్త నూకతోటిరాజేష్, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు బీరేంద్రవర్మ, సత్యవేడు నియోజక వర్గ జేసీఎస్ కన్వీనర్ వేలూరురాకేష్, నాయకులు జొన్నలగోపాల్‌రెడ్డి, ఉగ్గుమూడిగురునాథం, గెడితొట్టిగురవయ్య, గిరి, తులసీ, బాలాజీ, దేవదాసురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



పెన్నలపాడులో పథకాలను వివరిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి(తొట్టంబేడు) : అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణి రెడ్డి అన్నారు. బుధవారం తొట్టంబేడు మండలం పెన్నలపాడులో బుధవారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న వారందరికీ పథకాలు నేరుగా ఇంటికే వచ్చి చేరుతున్నాయన్నారు. ప్రతి ఇంటికీ పథకాల ద్వారా రూ.3నుంచి 4లక్షల వరకు లబ్ధి అందిందని తెలిపారు. ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వచ్చి ఓట్లడిగేవారిని ఆదరిస్తే మళ్లీ కనిపించరని విమర్శించారు. పారదర్శక పాలన కావాలంటే వైఎస్సార్ సీపీనే రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, సర్పంచ్ రేవతి, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మణినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు సుబ్రమణ్యం, నాయకులు సాయిబాబా నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, బాలగురవయ్య, మస్తాన్‌యాదవ్, అశోక్, చంద్ర, గంగాధరం, పురుషోత్తం యాదవ్, సాయి, చిరంజీవి, జగన్నాథం, కోవి చంద్రయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేవామిత్ర పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న వలంటీర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు సచివాలయంలో కంచనపుత్తూరు, కారణి, కరకంబట్టు గ్రామాల సర్పంచ్‌లు స్వప్న, చంద్రయ్య బుధవారం వలంటీర్లుకు సేవామిత్ర పురస్కారాలను అందించి, సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ మాట్లాడుతూ కరోనా కష్టంలో వలంటీర్లు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలను అందించారని తెలిపారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం





బీఎన్‌కండ్రిగ: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, బీఎన్‌కండ్రిగ: కల్లివెట్టులో..

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ, కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు తెలుగుతల్లి, తెలుగు రచయితల వేషధారణ ఆకట్టుకోగా, పురవీధుల్లో విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీమురళి మాట్లాడుతూ తెలుగు బాషాభివృద్ధి మండలి నిత్యం భాషోన్నతి కోసం చర్యలు గైకోవడంతో పాటు మంత్రుత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని లావాదేవీలు తెలుగులోనే నిర్వహించాలని తెలిపారు. అనంతరం వ్యాస రచన, పద్యపఠన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పుస్తకాలను, పెన్నులను, బహుమతులుగా అందించారు. హెచ్‌ఎం రమణయ్య, రూపేష్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శిరోమణి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్రీలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మాతృభాషపై పట్టు ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ పరదేశీయులు కూడా తెలుగుపై అభిమానం చూపుతున్నారన్నారు. విద్యార్థులు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

పీఈటీలకు స్కౌట్ బాధ్యత





మాట్లాడుతున్న ఈశ్వర్ రెడ్డి, జిల్లా ఉమెన్స్ స్కౌట్ అధికారి అమ్ములు

పిచ్చాటూరు: ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులకు స్కౌట్ బాధ్యతలను అప్పగించినట్లు ఎంఈఓ యుగంధర్ రాజు తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యవేడు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల పీఈటీలకు స్కౌట్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు మంచి క్రమ శిక్షణ పీఈటీలకు సాధ్యమన్నారు. పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ పీఈటీ అమ్ములు జిల్లా ఉమెన్స్ స్కౌట్ అధికారిగా నియమితులయ్యారని తెలిపారు. హెచ్‌ఎం గిరి ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి సీఆర్‌సీ సమావేశాల్లో స్కౌట్‌ను కూడా భాగం చేయాలన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆట స్థలం ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. వెంగళత్తూరు హెచ్‌ఎం ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాయామం ద్వారా ఆరోగ్యంగా, దేహధారుడ్యం పెరిగేలా పీఈటీలు చూడాలని తెలిపారు. అనంతరం పీఈటీగా పనిచేస్తూ పిచ్చాటూరు, వెంగళత్తూరు జెడ్పీ హైస్కూళ్లకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు పొందిన గిరిప్రకాష్, ఈశ్వర్ రెడ్డిని సత్కరించారు.ఎంఈఓ యుగంధర్ రాజు తెలిపారు. పీఈటీల అసోసియేషన్ కార్యదర్శి బాబు, కుమార్, హేమకుమార్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.